

అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

శనివారం 19 నవంబర్ 2022 పేజీలు : 04


# ఇండస్ట్రీలు పెట్టాలంటే వైసీపీ దెబ్బకు భయపడాల్సిందే

**- వ్యాలీ గ్రీన్ గార్మెంట్ టైలరింగ్ కేంద్రానికి దుండగులే నిప్పంటించారు - సిసి కెమరాలోని దృశ్యాలను డిఎస్పీ ఎందుకు దాచారు**

**- సమగ్ర విచారణ లేకుండా విధ్యుత్ షాట్‌సర్క్యూట్ అని తేల్చటంలో డిఎస్పీ అత్యుత్సాహం**



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న పెరుమాళ్ళ జీవానందరెడ్డి.



సంఘటన జరిగిన విధానాన్ని సిసి పుటెజ్ ద్వార వివరిస్తున్న పెరుమాళ్ళ జీవానందరెడ్డి

**పామిడి, నవంబర్ 18 ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్‌లో ఇండస్ట్రీలు నెలకొల్పాలంటే వైసీపీ దెబ్బకు ఎవరైనా భయపడాల్సిన పరిస్థితులు దాపురించాయని పాలకులు ప్రజాస్వామ్య వ్యవస్థను మంటగలుపుతున్నారని టిడిపి సీనియర్ నాయకులు, పిజేఆర్ ట్రస్టు వ్యవస్థాపకులు పెరుమాళ్ళ జీవానంద రెడ్డి ధ్వజమెత్తారు. సిసి కెమరాల్లోని దృష్యాలను డిఎస్పీ నరశింగప్ప దాచటం వెనుక మతలబు ఏమిటో అంతుపట్టని విధంతా తయారైందని పెరుమాళ్ళ జీవానందరెడ్డి తెలియజేస్తూ శుక్రవారం టైలరింగ్ కేంద్రానికి దుండగులు ఎలా నిప్పంటించారో సిసి పుటేజ్ దృశ్యాలను టివి ద్వార విలేఖరుల ఎదుట ప్రదర్శించారు. గుంతకల్లు నియోజకవర్గంలోని పామిడి మండలం గజరాంపల్లిలో పిజేఆర్ వ్యాలీ గ్రీన్ గార్మెంట్ టైలరింగ్ కేంద్రానికి ఈనెల 11న వెంటిలేటర్ నుండి దుండగులే నిప్పంటించారని జరిగిన సంఘటనపై గుంతకల్లు డిఎస్పీ నరశింగప్ప సమగ్ర విచారణ జరుపకుండా ఎమ్మెల్యే వైవీఆర్ డైరెక్షన్‌ల విధ్యుత్ షాట్‌సర్క్యూట్ అని తేల్చుటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వెంటిలేటర్ దుండగులు నిప్పంటించే దృశ్యాలు ఉన్నప్పటికీ పోలీసులు గుర్తింకపోవటం దారుణం అన్నారు. జరిగిన సంఘటనపై టిడిపి అధినేత చంద్రబాబునాయుడు ట్విట్టర్ వేదికగా స్పందించగానే గుంకతల్లు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి అక్కడ జరిగింది విధ్యుత్ షాట్‌సర్క్యూట్ అని ప్రకటించిన 24 గంటల్లోనే గుంతకల్లు డిఎస్పీ నరశింగప్ప, సిఐ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎస్‌ఐ చాంద్‌బాషా పామిడి పోలీస్‌స్టేషన్‌లో కాకుండా గుత్తి పోలీస్‌స్టేషన్‌లో ప్రెస్‌మీట్ పెట్టి విధ్యుత్ షాట్‌సర్క్యూట్ అని తేల్చటం అందుకనుగుణంగా



దుండగులు బెండ్ చేసిన వెంటిలేటర్ ఇదే

పామిడి వైసీపీ నాయకులు కూడా కేవలం గంటలోపు ప్రెస్‌మీట్ పెట్టి అదేపాట పాడుతూ డ్రామాను రక్తి కట్టించారని ఆరోపించారు. టైలరింగ్ శిక్షణా కేంద్రంలో 8 సిసి కెమరాలు ఉండగా 7 సిసి కెమరాలే అని డిఎస్పీ చెప్పారని ఇదేక్రమంలో 8 సిసి కెమరాల పుటేజ్‌ను చూడటానికి కనీసం వారం పడుతుందని అలాంటిడి కేవటం 30 గంటల్లోనే సిసి కెమరాలను ఎలా చూశారని.. సంఘటన జరిగిన స్థలాని డాగ్ స్క్వాడ్‌ను రప్పించకుండా అక్కడ ఒక కానిస్టేబుల్‌ని కూడా పెట్టకపోవటం వారి బాద్యాతారాహిత్యానికి నిదర్శనం అంటూ పైగా డిఎస్పీకి నేనే స్వయంగా ఫోన్ చేసి ట్రస్టు సభ్యులచేత సిసి కెమరాల పుటేజ్‌ను పోలీస్‌స్టేషన్ నందు హార్డ్‌డిస్క్‌ను అందజేయటం జరగిందని ఈక్రమంలో వారు నాపై నిందలు వేయటం ధుర్మార్గామని నా వస్తువును నేను భద్రపరుచుకోవటం దొంగలించటమా ఇదేవి న్యాయం అన్నారు. ప్రమాదం జరిగినప్పుడు ఎవ్వరుకూడా నష్టాన్ని అంచనా వేయలేమని మేమే రూ.40 లక్షలు అయ్యిండొచ్చు అని చెబుతూ అంచనావేసిన తరువాత రూ.36 లక్షలు అని తెలియజేశామని దాని డిఎస్పీ ఇదేదో ప్లాన్ ప్రకారం చేస్తున్నారని అనటం సబబుగా లేదని మా ఆస్థి కాలిపోయి మేము భాదపడుతున్నామని ఈక్రమంలో ఇల్లు కాలి ఒకడేస్తుంటే చుట్ట కాల్చుకోవటానికి నిప్పు అడిగిన చందంగా డిఎస్పీ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అన్నిపార్టీల వారు వచ్చి పరిశీలిస్తున్న నేపద్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి పామిడిలోనే పర్యటిస్తున్న ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ఇటువైపు ఎందుకు కన్నెత్తి చూడలేదన్నారు. పామిడి మండలంలో ఇప్పటివరకూ అనేక అగ్ని ప్రమాదాలు జరిగాయని అయినప్పటికీ పోలీసు యంత్రాంగానికి చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. టైలరింగ్ కేంద్రం దగ్ధమైన సంఘటనలో వేకువజామున 2 గంటల 39 నిమిషాల 42 సెకండ్ల వరకూ 17 సెకండ్లు మాత్రమే వెలుతురు వస్తుందని 2 గంటల 42 నిమిషాల 22 సెంకడ్లకి 2 గంటల 57 నిమిషాల తరువాత వెంటిలేటర్ గోడకు ఆనుకుని పెద్దమంట కిందకు పడుతుందని దాని ద్వారనే మొత్తం దగ్ధవైందన్నారు. ఇవన్నీ సిసి పుటేజిలో రికార్డు అయ్యాయని సిసి కెమరాలు బాగానే పనిచేస్తున్నాయని గ్రామ ప్రజలు మంటలు ఆర్పే వరకూ సిసి కెమరాలు పని చేస్తుండగా లోపల బయట ఎక్కడ కూడా షాట్‌సర్క్యూట్ అయినట్లు కనిపించలేదని వెంటిలేటర్ నుండి నిప్పు వేశారని అక్కడ మూడు కుర్చీలున్నాయని దుండగులు వాటిని వినియోగించటం, బయట బలుపును తీసి అక్కడున్నటువంటి చిలుకు వైరును పక్కనేవున్న ప్లెక్సీలోకి దూర్చి ఉంటారంటూ వాటి దృశ్యాలను చూపించారు. పోలీసులు రాజకీయ నాయకుల డైరెక్షన్‌లో కాకుడా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే క్రమంలో తమ బాద్యతలను అంకితభావంతో నిర్వర్తిస్తూ నిజానిజాలను నిగ్గుతేల్చాలని పోలీసు వ్యవస్థపై ఉన్నటువంటి గౌరవాన్ని కాపాడాల్సిన అవసరం ఎంతైనావుందన్నారు. జరిగిన సంఘటనపై సమగ్ర విచారణ జరిపించి దుండగులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, ఎస్పీలను కలిసి విన్నవిస్తామని అవసరమైతే డిజిపి కలుస్తామని పెరుమాళ్ళ జీవానందరెడ్డి వెల్లడించారు.

## జాకీ కంపెనీ మాటున అవినీతి

# రూ.140 కోట్ల చీకటి ఒప్పందం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

**- వారు అవినీతికి పాల్పడి తమపై ప్రచారం**

**- పరిటాల సునీతపై ఎమ్మెల్యే తోపుదుర్తి విమర్శలు**

**అనంతపురం సిటీ, నవంబర్ 18 ప్రభాతవార్త**

టిడిపి హయాంలో జాకీ కంపెనీ మాటున వాటి అనుబంధ కంపెనీతో 140 కోట్ల రూపాయల అవినీతి చీకటి ఒప్పందాలను నాటి మంత్రులు పరిటాల సునీత, లోకేష్‌లు చేసుకున్నారని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి విమరి ్శంచారు. నగరంలోని ఆర్‌అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో ఆయన శుక్రవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి పాలనలో అనంతపురం సరిహద్దులో రాప్తాడు వద్ద వాల్మీకులకు చెందిన 28 ఎకరాల భూమిని పరిశ్రమల పేరిట రైతులకు ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా స్వాధీనం చేసుకున్నారన్నారు. వందల కోట్ల విలువైన భూమిని జాకీ అనుబంధ సంస్థ ఫేజ్ ఇండస్ట్రీస్‌కు 2.80 కోట్లకు కట్టబెట్టారన్నారు. వాస్తవానికి ఆ భూమి ధర 140 కోట్ల రూపాయలు చేస్తుందని తక్కువ ధరకే ఫేజ్ కంపెనీకి కట్టబెట్టి పెద్దఎత్తున అవినీతికి పాల్పడ్డారన్నారు. సదరు సంస్థ ఎన్నికల సమయం కావడంతో ధైర్యంగా పనులు ప్రారంభించేందుకు ముందుకు రాలేదని కనీసం ప్రహరీగోడ నిర్మించలేదన్నారు. ఎన్నికల తరువాత అధికారం మారడంతో తమ అవినీతి బయటపడుతుందన్న ఉద్దేశ్యంతో సదరు సంస్థ పనులు చేపట్టకుండా వెళ్లిపోయిందన్నారు. అయితే తాము డబ్బులు డిమాండ్ చేయడం వల్లే సదరు సంస్థ వెళ్లిపోయిందని పదేపదే పరిటాల సునీత గ్లోబల్ ప్రచారానికి పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు. వారి ప్రచారాలు వారి అనుకూలురు నమ్ముతారేమోతప్ప సామాన్యులు ఎవరూ నమ్మే పరిస్థితి లేదన్నారు. 140 కోట్ల రూపాయల విలువ చేసే భూములకు 15 కోట్లు లంచం అడిగితే ఎవరైనా ఇవ్వకుండా వదులుకుంటారా అని కనీసం బుద్దుండి మాట్లాడుతున్నావా సునీతమ్మ అంటూ ఆయన ఘాటుగా విమర్శించారు. ఐదేళ్ల టిడిపి పాలనలో అవినీతి తప్ప ప్రజాసంక్షేమాన్ని ఏనాడు పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. పరిశ్రమలు వస్తున్నాయని వాటికి రోడ్డు సౌకర్యం కావాలని పేదల ఇళ్లను కూల్చిన చరిత్ర పరిటాల కుటుంబానిదేనని ఆయన విమర్శించారు. మీరు కూల్చిన ఇళ్ల బాధితులకు జగనన్న ఇళ్ల కాలనీల్లో స్థలాలు ఇప్పించి ఇళ్ల నిర్మాణం చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా మహానటి నాటకాలు పరిటాల సునీత మానుకోవాలని ఆయన ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో వైసిపినేతలు లింగల రమేష్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# ఆర్‌బికెల ద్వారా రైతులకు శాస్త్ర విజ్ఞానం అందించాలి

## - జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి





మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి , హాజరైన అధికారులు

**అనంతపురం, నవంబర్ 18 ప్రభాతవార్త బ్యూరో**

రైతు భరోసా కేంద్రాల ద్వారా జిల్లా రైతులకు వ్యవసాయ శాస్త్ర పరిజ్ఞానాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి జిల్లా స్థాయి వ్యవసాయ సలహామండలి సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని రకాల సేవలు గ్రామ సచివాలయాల ద్వారా మండలాల నుండి గ్రామస్థాయిలో అందిస్తున్నట్లే వ్యవసాయ సేవలు సైతం గ్రామస్థాయిలో ఆర్‌బికెల ద్వారా పూర్తి స్థాయిలో అందాలన్నారు. ఎరువులు, పురుగుమందులతో పాటు విత్తనం నాటి మంచి కోత వరకు అవసరమైన పరిజ్ఞానం అందించేందుకు రైతు భరోసా కేంద్రానికో వ్యవసాయ శాస్త్రవేత్తను అందుబాటులో వుంచాలని ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. అంతకుమునుపు మండల స్థాయి అధికారులు ఆర్‌బికె కేంద్రంగా వ్యవసాయ సలహాలు, సూచనలు నిత్యం రైతులకు అందించాలన్నారు. జెడ్‌పిచైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరుకున్నట్లుగా రైతులకు ఏ సమస్య వచ్చినా ముందు గుర్తొచ్చే కార్యాలయాలుగా ఆర్‌బికెలు నిలవాలన్నారు. వ్యవసాయ సలహా మండలి చైర్‌పర్సన్ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మండల స్థాయి సలహా మండలి సమావేశాల్లో రైతులు పాల్గొనేలా అభ్యుదయ రైతులు, అధికారులు కృషి చేయాలని కోరారు. ప్రస్తుత సీజన్ కోసం అవసరమయ్యే పురుగుమందులు, ఎరువులు ముందస్తుగా అందుబాటులో వుంచాలని తెలియచేశారు. ఈ సమావేశంలో ఎడిసిసి చైర్‌పర్సన్ లిఖిత, వ్యవసాయశాఖ జెడి చంద్రానాయక్, ఇతర వ్యవసాయఅనుబంధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అంబరాన్నంటిన సంబరం

**- ఘనంగా వేణుగోపాల స్వామి రథోత్సవం - ప్రారంభమైన భగవాన్ శ్రీసత్యసాయి జయంతి వేడుకలు**





రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఆర్.జె.రత్నాకర్ , ఆశేష జనవాహిన నడుమ వేణుగోపాల స్వామి రథోత్సవం దృశ్యం

**పుట్టపర్తి, నవంబర్ 18, ప్రభాతవార్త**

పవిత్ర పుణ్యక్షేత్రమైన పుట్టపర్తి సాయి నామస్మరణతో మారుమ్రోగింది. ప్రేమమూర్తి భగవాన్ సత్యసాయి బాబా 97వ జయంతి వేడుకలను పురస్కరించుకొని శుక్రవారం సంబరం అంబరాన్నంటింది. ఉదయమే సాయికుల్వంత్ సభా మందిరంలో అశేష భక్తజనం పాల్గొని ఈ వేడుకలను ప్రారంభించారు. శ్రీసత్యసాయి సత్యనారాయణ వ్రతాలు నిర్వహించి, సీతారాముల కల్యాణం జరిపించారు. మందిరంలో ఉంచిన వేణుగోపాల స్వామి ఆంజనేయ స్వామి ఉత్సవ మూర్తుల విగ్రహాలను ఈశాన్య గోపురం వద్ద వెలుపలకు తీసుకువచ్చారు. అక్కడ ప్రత్యేక రథంపై వేణుగోపాల స్వామిని, పల్లకిపై ఆంజనేయ స్వామి విగ్రహాలను ఉంచారు. శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్ ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి వేణుగోపాల స్వామి రథోత్సవాన్ని ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్, సంయుక్త కలెక్టర్ టి.ఎస్.చేతన్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, ఎమ్మెల్యే తండ్రి దుద్దుకుంట వెంకటరామిరెడ్డి, అధికారులు, ప్రజా ప్రతినిదులు, వేలాది మంది ప్రజలు రథోత్సవంలో పాల్గొన్నారు. పచ్చటి తోరణాలు, పుష్పాలంకరణలు, రంగవల్లులతో తీర్చి దిద్దిన పుట్టపర్తి పురవీధుల గుండా ఉత్సవం సాగింది. భక్తులు స్వామి వారికి కాయకర్పూరం, ఫలం, పుష్పం సమర్పిస్తూ మొక్కులు తీర్చుకున్నారు. ఓం శ్రీ సాయిరాం...ఓం శ్రీ సాయిరాం... అంటూ సత్యసాయి సేవ సభ్యులు రథాన్ని లాగుతూ భక్తకోటి బాబాను కీర్తిస్తూ... భక్తిగేయాలు ఆలపిస్తూ... సాయినామస్మరణతో పుట్టపర్తి పురవీధులు మారుమ్రోగాయి. సత్యసాయి విద్యార్థిగణం వేదపఠనం గావిస్తూ... డప్పులు, మేళతాళాలతో బ్యాండు వాయిద్యాలు, కోలాటలు, శ్రీకృష్ణగోపికల వేషధారణలు, విభిన్న సంస్కృతులు, పురాణ గాధల ప్రదర్శనల నడుమ వేణుగోపాల స్వామి రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రశాంతి నిలయం ఈశాన్యం గోపురం వద్ద నుండి హనుమాన్ సర్కిల్ వద్ద ఉన్న పెదవెంకటమ్మ రాజు కల్యాణ మండపం వరకు రథోత్సవం సాగింది. ఆర్.జె.రత్నాకర్ దంపతులు మహామంగళహారతి ఇచ్చి ఉత్సవాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో పుడా ఛైర్మన్ లక్ష్మినరసమ్మ గంగాద్రి దంపతులు, మున్సిపల్ ఛైర్మన్ తుంగ ఓబుళపతి, మాజీ పుడా ఛైర్మన్ కోటా సత్యం,కౌన్సిలర్లు, ఎఎస్‌పి రామకృష్ణప్రసాద్, డిఎస్‌పి యశ్వంత్, ఆర్‌డిఓ భాగ్యరేఖ, పుట్టపర్తి స్థానికులు, దేశవిదేశీ సాయి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వడివడిగా..! అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా..!

**៖ ప్రజాసేవే పరమావధిగా సాగుతున్న కేతిరెడ్డి పెద్దారెడ్డి**

**៖ యాడికి మండల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి**

**៖ సాగు, తాగునీరు, డ్రైనేజీ, వైద్య సదుపాయాలపై మండలవాసుల హర్షం**











గత ప్రభుత్వ హయాంలో రాయల 'చెరువు' పరిస్థితి..!, ప్రస్తుతం జలకళతో నిండిన రాయల'చెరువు', గతంలో వెలవెలపోతున్న యాడికి కాలువ, ప్రస్తుతం యాడికి కాలువ నీటిని వాడుకుంటున్న రైతులు, గడప గడపలో రాయలచెరువులోని మురుగునీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

**తాడిపత్రి, ప్రభాతవార్త:**

గ్రూపు రాజకీయాలు, అభివృద్ధి పట్టని పాలకులు, అన్నింటా అవినీతి మరకలు వెరసి సాగునీరే కాదు తాగునీరు కూడా సక్రమంగా అందని దుస్థితి. తాడిపత్రి, పెద్దపప్పూరు మండలాలకు పెన్నానది పరీవాహక ప్రాంతం, పెద్దవడుగూరు మండలానికి హెచ్‌ఎల్‌సీ కెనాల్ ఉండటంతో సాగుకు ఢోకా లేదు. కానీ ఎటువంటి సాగునీటి వనరులు లేని యాడికి మండలానికి కేవలం వర్షాధారమే పెద్దదిక్కు. యాడికి కుడి ఎడమ కాలువలు, రాయలచెరువు వంటి పెద్ద చెరువు ఉన్నప్పటికీ సాగునీరందించే చిత్తశుద్ధి పాలకులకు ఉండేది కాదు. తాడిపత్రి తర్వాత అభివృద్ధి, ఆదాయంలో ముందుంటే యాడికి మండలం చాలా కాలంగా నిర్లక్ష్యానికి గురైంది. విద్య, వైద్యం, సాగు, తాగునీరు, డ్రైనేజీ వంటి ప్రజా సమస్యలు దీర్ఘకాలికంగా పరిష్కారానికి నోచుకోక జనం అసహనానికి గురయ్యేవారు. ఇదంతా గత ప్రభుత్వాల పాలనలో నెలకొన్న దుస్థితి. దీంతోనే గత ప్రభుత్వాలను చీదరించుకున్న ప్రజలు ఈ సార్వత్రిక ఎన్నికల్లో కేతిరెడ్డి పెద్దారెడ్డికి పట్టం కట్టారు. ఆయన ఎమ్మెల్యేగా మరో పదిరోజుల్లో మూడున్నర సంవత్సరాలు పూర్తి చేసుకోనున్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజాభివృద్ధే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. అనతి కాలంలోనే తనదైన ముద్ర వేసుకొని ప్రజల మన్ననలు పొందుతున్నారు. బాధ్యతలు స్వీకరించినప్పటినుంచి మూడున్నరేళ్లలో ఎమ్మెల్యే మార్కు పాలనపై 'ప్రభాతవార్త' ప్రత్యేక కథనం.

**៖రాయల'చెరువు'కు మోక్షం..!** : 0.065 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో, 525 ఎకరాల విస్తీర్ణంతో తాడిపత్రి నియోజకవర్గంలోనే అతి పెద్దదైన రాయల'చెరువు' ఏళ్ల తరబడి నిర్లక్ష్యానికి గురవుతూ వస్తోంది. ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన కేతిరెడ్డి పెద్దారెడ్డి 2019 నుంచి 2022 వరకు ప్రతి ఏడాది చెరువును నింపుతూనే ఉన్నారు. తద్వారా 12 సమీప గ్రామాల్లో భూగర్భ జలాలు పెరిగి తాగునీటి సమస్య పరిష్కారమైంది. యాడికి కాలువ ద్వారా సాగునీటిని రాయలచెరువులోని కతవ వంకకు తెస్తుండగా ప్రతిపక్ష పార్టీ నాయకులు పన్నిన కుట్రలను తోసేసి ప్రకృతి సాయంతో కతవకు నీటిని తేవడం రైతుల్లో మరింత ఆనందం నింపుతోంది.

**៖యాడికి కాలువలో ఏటా సాగునీటి వేడుక..!**

యాడికి కుడి ఎడమ కాలువలకు ఏటా సాగునీటి విడుదలతో అన్నదాతల్లో ఆనందోత్సాహాలు పెల్లుబికుతున్నాయి. దీంతో యాడికి మండాలనికి కూడా సాగునీటి వనరులున్నాయని, వాటితో సాగునీటి సమస్యలు తీరుతున్నాయనే భరోసా రైతుల్లో కలుగుతోంది. యాడికి కాలువ ద్వారా సాగయ్యే అవకాశమున్న 1,800 ఎకరాలకు గానూ దాదాపు 1000 ఎకరాలకు భూగర్భ జలాలు పెరగడం ద్వారా సాగునీటి ప్రయోజనం దక్కుతోంది. మండలంలోని 40 శాతం చెక్‌డ్యామ్‌లు ఈ కాలువ నీటితో నిండుతున్నాయి.

**៖ అడుగులన్నీ అభివృద్ధి వైపే..!** యాడికి మండలంలో అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించారు. యాడికి పంచాయతీలోని యాడికి-పెద్దపేట, వీరారెడ్డిపల్లి గ్రామాల్లో రోడ్ల నిర్మాణం, యాడికి, పెద్దపేటల్లో తాగునీటి ఏర్పాట్లు, రూ. 1.5 కోట్లతో రాయలచెరువు, రామరాజుపల్లిలో డ్రైనేజీ నిర్మాణం, రూ. 5 లక్షలతో విద్యుత్తు వినియోగదారుల కేంద్రం నిర్మాణం, రూ. 1.95 కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణం, తూట్రాళ్లపల్లిలో డ్రైనేజీ నిర్మాణం, యాడికిలో డ్రైనేజీ నిర్మాణానికి అంచనాలు, రాయలచెరువులో జాతీయ రహదారి పక్కన నిరుపేదలకు ఇళ్ల స్థలాల కేటాయింపు, రాయలచెరువు, కూర్మాజిపేటల్లో దీర్ఘకాలిక విద్యుత్తు సమస్యల పరిష్కారం వంటి వాటిల్లో ఎమ్మెల్యే తనదైన ప్రత్యేక ముద్ర వేశారు. రాయలచెరువులో ఆక్రమణలకు గురైన రూ. 2 కోట్లకు పైగా విలువైన గ్రామ కంఠం స్థలాల పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ కనపరచడంపై స్థానికుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



ప్రస్తుతం డ్రైనేజీ ఏర్పాటు తర్వాత పరిస్థితి

# ఇ.ఇ.ఇ. విద్యార్థుల నమూనా రాష్ట్రస్థాయి పాలిటెక్నిక్ ఫెస్ట్ పోటీలకు ఎంపిక



సైకిల్ నమూనా వద్ద విద్యార్థులు, కళాశాల యాజమాన్యం

అనంతపురం, నవంబర్ 18 ప్రభాతవార్త బ్యూరో
స్థానిక రుద్రంపేట వద్ద గల పి.వి.కె.కె.ఐ.టి. డిప్లొమో కళాశాలలో ఇ.ఇ.ఇ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు బి.లక్ష్మణ్, సి.సతీష్‌కుమార్, ఎస్. జశ్వంత్‌నాయుడు, ఎస్.కె.ఎం.డి తాహీర్ తయారు చేసిన పెడల్ ఆపరేటెడ్ ఈ–బైసైకిల్ (రీచార్జబుల్) నమూనా రాష్ట్రస్థాయి పాలిటెక్నిక్ ఫెస్ట్‌కు ఎంపికైంది. వీరు తయారు చేసిన నమూనాను 16, 17 తేదీల్లో అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన రీజనల్ పాలిటెక్నిక్ ఫెస్ట్ నందు ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో వీరు తయారు చేసిన నమూనాకు రాష్ట్ర స్థాయి పాలిటెక్నిక్ ఫెస్ట్‌కు ఎంపిక చేయడం జరిగింది. కళాశాల చైర్మన్ డాక్టర్ పల్లె వెంకటక్రిష్టకిషోర్ మాట్లాడుతూ తమ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు తయారు చేసిన పెడల్ ఆపరేటెడ్ ఈ–బైసైకిల్ (రీచార్జబుల్) నమూనా రాష్ట్రస్థాయి పాలిటెక్నిక్ ఫెస్ట్ పోటీలకు ఎంపిక కావడం చాలా ఆనందంగా వుందన్నారు. ఇలాంటి కార్య క్రమాల ద్వారా విద్యార్థుల యొక్క సృజనాత్మకతను వెలికి తీయ వచ్చున్నారు. చిన్నతనం నుండి విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకుని భవిష్యత్తులో ప్రజల అవసరాలకు తగ్గట్లు శాస్త్ర సాంకేతికను కొత్త పుంతలు తొక్కించాలని ఆకాం క్షించారు. డిప్లొమా కళాశాల ప్రిన్సిపాల్ జీఎన్ఎస్ వైభవ్ మాట్లాడుతూ ఇలాంటి ఎన్నో కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొనడం ద్వారా రాష్ట్ర స్థాయిలో బహుమతులు సాధిస్తున్నారన్నారు. ఇలాంటి కార్యక్రమాల్లో పివికెకెఐటి డిప్లొ మా విద్యా ర్థులు పాల్గొనేలా ఎల్లప్పుడూ ప్రోత్సహించడం జరుగుతుందని ఆయన తెలియచేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల కోశాధికారి పల్లె సింధూరరెడ్డి, కళాశాల యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, ఎంబిఏ ప్రిన్సిపాల్ ఎం.సుబ్బారావు, డిప్లొమా ఇఇఇ విభాగాధిపతి జయలక్ష్మిలు అభినందించారు.

# మరపురాని మహానటుడు సూపర్‌స్టార్ కృష్ణ



కృష్ణ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న వైసిపి నేత అనంత చంద్రారెడ్డి

అనంతపురం సిటీ, నవంబర్ 18 ప్రభాతవార్త
మరపురాని మహానటుడు సూపర్‌స్టార్ కృష్ణ అని వైసిపి సీనియర్ నేత అనంత చంద్రారెడ్డి కొనియాడారు. సూపర్‌స్టార్ కృష్ణ సంతాపసభను జిల్లా వైకాపా కార్యాలయంలో వైసిపి సీనియర్ నేత కృష్ణ అభిమాన సంఘం నాయకులు ఆలమూరు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైసిపి సీనియర్ నేత అనంత చంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు 350పైగా సినిమాల్లో సూపర్‌స్టార్ కృష్ణ నటించి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. నటునిగా, రాజకీ యనేతగా, మానవతావాదిగా కృష్ణ ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. ఆయన సేవలను ఈ సందర్భంగా వారు స్మరించుకున్నారు. ఈ కార్యక్ర మంలో వైసిపి సీనియర్ నేతలు గౌస్‌బేగ్, నరసింహులు, మా రుతినాయుడు, గోగుల పుల్ల య్య, పెన్నోబులేసు, దేవాంగం రామయ్య, తలారి నవీన్, జావెద్, గోపాల్ మోహన్, కార్పొరేటర్లు సైపుల్లాబేగ్, నరసి ంహులు, శ్రీనివాసులు, రహం తుల్లా, ఇషాక్, తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాలకు నష్టపోయిన అన్నదాతలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాల్సిందే
## - సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్



మాట్లాడుతున్న సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్

అనంతపురం, నవంబర్ 18 ప్రభాతవార్త బ్యూరో
అతివృష్టి, అనావృష్టితో జిల్లా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వారిని ఆదుకోవడంలో వైసిపి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్ విమర్శించారు. జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ నీలం రాజశేఖ ర్‌రెడ్డి భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో అన్ని రకాల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. వేరుశనగ, వరి, మొక్కజొన్న, పత్తి పంటలతో పాటు పండ్ల తోటలకు భారీగా నష్టం జరిగిందన్నారు. జిల్లాలో పంట నష్టం జరిగిన ప్రతి రైతు కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని నమ్మబలికి ఓట్లు దండుకుని నేడు రైతు పట్ల ఇసుమంతైనా కణికరం లేకుండా వున్నారన్నారు. మూడేళ్ల క్రితం సిఎం జగన్ ఆర్భాటంగా ప్రారంభించిన రైతు భరోసా కేంద్రాలు నేడు నిరుపయోగంగా మారడంతో అన్నదా తలు దిక్కుతోచని స్థితిలో పడ్డారని అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న రైతుల ఆత్మహత్యలకు వైసిపి ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. ఒకవైపు భారీ వర్షాలతో పంట చేతికందక రైతులు నష్టాలను చవిచూస్తుంటే మరోవైపు నకిలీ విత్తనాలు రైతులను అప్పుల పాలు చేస్తున్నా యని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వైసిపి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని, నకిలీ విత్తనాల విక్రేతలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఎస్టీ జాబితాలోకి వాల్మీకులను చేర్చేప్రయత్నం ప్రభుత్వం ఆపాలి..!
## - దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు మోహన్‌నాయక్



మాట్లాడుతున్న మోహన్‌నాయక్

ఆత్మకూరు నవంబర్ 18 ప్రభాతవార్త
వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి చేర్చే ప్రయత్నం విరమించుకోవాలని కోరుతూ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజ్ నందు హరిత దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు బి,మోహన్‌నాయక్ శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు.ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి చేర్చే ప్రయత్నం మానుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్టీలు చాలా వెనుకబడి ఉన్నారని,విద్యాభివృద్ధికి నోచుకోలే దని, ఇప్పటికి మారుమూల సుదూర ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్నా మన్నారు. విద్యాభివృద్ధి,ప్ర భుత్వ పథకాలు సరిగా అందక గిరిజనలు వెనుకబడి ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వాల్మీకులు సమాజంలో అన్నిరంగాలల్లో అభివృద్ధి చెంది ఉన్నారని, విద్యాలోను, ఉద్యోగాల్లోను ఎక్కువ శాతం ఉన్నారన్నారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి చేర్చి గిరిజన ప్రజల బతుకులు నాశనం చేయ్యవద్దని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్ణ యం ఉపసంహరించుకోవాలని, జీఓ నెంబర్ 52ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జీఓను రద్దుచేయని ప క్షంలో విద్యార్థులు, గిరిజనలు ప్రజలతో కలసిపెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు గిరిజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడి కేంద్రాలను తనిఖీ చేసిన సర్పంచ్ సుగాలి పద్మావతి



వైఎస్సాఆర్ బాలామృతం అందిస్తున్న దృశ్యం

అనంతపురం రూరల్,నవంబర్18ప్రభాతవార్త:
అనంత రూరల్ మండలం రుద్రంపేట పంచాయితీలో గల పలు అంగన్‌వాడి కేంద్రాలను సర్పంచ్‌సుగాలిపద్మావతి అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు తనిఖీ చేసి అంగన్‌వాడి కేంద్రంకు వచ్చే విద్యార్థులకు రుచికరమైన పౌష్టికాహార భోజనంను అందించాలని వంట వారికి తెలియజేశారు. శుక్రవారం అనంత రూరల్ మండలం రుద్రంపేట పంచాయితీలో గల పలు అంగన్‌వాడి కేంద్రాలను ఆమె సందర్శించి విద్యా ర్థుల తరగతుల గదులను పరిశీలించి,వారికి విద్య ఏవిధంగా చేబుతున్నారో విద్యార్థులను అడిగిన తెలుసుకుని అనంతరం విద్యార్థులకు వండిన వంటల ను పరిశీలించిన భోజనాలు తింటున్న విద్యార్థులను వంటలు ఏ విధంగా ఉన్నాయో అని అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వం అందిస్తున్న మెను ప్రకారం బోజనాలు పెడుతున్నారని విద్యా ర్థులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా విద్యార్థులకు ప్రతి రోజు రుచికరమైన వంటలు వండి వారికి పౌష్టికాహార భోజనాలను అందించాలని అంగన్ వాడి టీచర్‌కు,వంట వారికి తెలిపారు. అంగన్‌వాడి కేంద్రంలో ఏమైన సమస్యలు ఉంటే తమకు తెలియజేస్తే వాటిని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి దృష్టికి తీసుక పో యి సమస్యలు పరిష్కరానికి కృషి చేస్తామని సిబ్బందికి తెలియజేశారు. అనంతరం పిల్లల తల్లులకు వైఎస్సా ఆర్ బాలామృతం వస్తువులు,కోడి గుడ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటీసిలు,వార్డు సభ్యులు, మహిళాలు తదితరులు పాల్గొన్నారు.

# రూ.15 లక్షల రూపాయాల వ్యయంతో సిసి రోడు ఏర్పాటుకు భూమి పూజ
## - అక్కంపల్లి గ్రామ సర్పంచ్ వడ్డే పుష్పావతి లింగమయ్య.



సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న సర్పంచ్ వడ్డే పుష్పవతి లింగమయ్య

అనంతపురం రూరల్,నవంబర్ 18 ప్రభాతవార్త:
అనంత రూరల్ మండలం అక్కంపల్లి గ్రామ పంచాయితీని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సహాయ సహకారాలతో అభివృద్ధి బాటలో నడిపిస్తున్నమని గ్రామ సర్పంచ్ వడ్డే పుష్పావతి లింగమయ్య తెలిపారు. శుక్రవారం అక్కంపల్లి పంచాయితీలోని ఎన్ఆర్ కాలనీలో రూ.15 లక్షల వ్యయంతో ఆమె స్థానిక ఎంపిటిసి సంజీవురాయుడు, స్థానిక నాయకులతో కలిసి సిసి రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 18 నె లల కాలంలో రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సహాయ సహకారాలతో అక్కం పల్లి గ్రామ పంచాయితీలో రూ.కోటి 30 లక్షల రూపాయల వ్యయంతో తారు రోడ్డు,సిసి రోడ్ల పనులు చేయించి పంచాయితీని అభివృద్ది బాటలో నడిపించడం జరుగు తుందన్నారు. అదే విధంగా గ్రామంలోని ప్రజలు, ప్రజాప్రతినిధుల సహయ సహకారాలతో పంచాయితీని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుపోవడం జరుగు తుందన్నారు. పంచాయితీ అభివృద్ధికి సహయ సహకారా లు అందిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియ జేస్తున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు అజయ్ గౌడ్,ఎర్రిస్వామి, పాల పెద్దన్న, వడ్డే సుంకన్న,బోయ శ్రీరాములు,వార్డు సభ్యులు ధనుంజయ, రామాంజినేయులు, శ్రీరాములు, సర్దార్, మారెప్ప, పంచాయితీ కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఒంటేరుకు ఏపిఎస్ఈఏ సంపూర్ణ మద్దతు



ఒంటేరుకు లెటర్‌ను అందజేస్తున్న విజయ్ భాస్కర్

అనంతపురం న్యూటౌన్, నవంబర్ 18 ప్రభాతవార్త
పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఒంటేరు శ్రీనివాసులరెడ్డికి ఏపిఎస్ఈఏ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయ్ భాస్కర్ తెలిపారు. శుక్రవారం నగరంలోని ఉపాధ్యాయ భవన్‌లో జరిగిన సమావేశంలో ఒంటేరుకు ఏపిఎస్ఈఏ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు లెటర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఒంటేరు ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్నారని, ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీస్ రూల్స్, భాషా పండితులు, వ్యాయమ ఉపాధ్యాయుల పోస్టులు అప్‌గ్రేడ్ చేయడంలో, కాంట్రిబ్యూటరీ పెన్షన్ సమస్యల పరిష్కారంలో, ఎయిడెడ్, కెజిబివి, కాంట్రాక్టు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం చేశారన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్న ఒంటేరుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టిఏ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు కరణం హరిక్రిష్ణ, ఎస్ఎల్‌టిఏ నేత శివానందరెడ్డి, ఆదిశేషయ్య, వేణుగోపాల్‌తో పాటు పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ అధికారులను మోసం చేస్తున్న ఇద్దరు అరెస్ట్



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి

అనంతపురం క్రైం, నవంబర్ 18 ప్రభాతవార్త
సిఎంవో కార్యాలయం అధికారినంటూ ఫోన్లలో నమ్మబలుకుతూ డబ్బులు గుంజుతున్న వ్యక్తి సహా ఇద్దర్ని అరెస్ట్ చేసినట్లు అనంతపురం డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం నగరంలోని డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ...రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వ అధికారులను మోసం చేసి డబ్బులు గుంజినట్లు విచారణ లో వెల్లడైందన్నారు.

**నిందితుల వివరాలు :** .తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా కుంట్లూరు గ్రామంలోని హయాత్‌నగర్‌కు చెందిన రాయబండి సూర్యప్రకాష్ చారి, అదే గ్రామానికి చెందిన దావులూరి ప్రసాద్‌లను అరెస్ట్ చేశారు.

**నేపథ్యం :** ప్రస్తుతం అరెస్ట్ అయిన ఇద్దరి నిందితుల్లో సూర్యప్రకాష్ ఆచారి కీలకమైనవాడు. తాగుడుకు బాసినై ఈ వ్యసనాన్ని తీర్చుకునే క్రమంలో సులభముగా డబ్బులు సంపాదించాలని భావించాడు. ప్రభుత్వ అధికారులను టార్గెట్ చేశాడు. రెండు తెలుగు రాష్ట్రాలలోని రెవెన్యూ, మున్సిపల్, సబ్ రిజిస్ట్రార్, ఆర్అండ్‌బీ తదితర ప్రభుత్వ విభాగాల ఉన్నతాధికారుల ఫోన్ నెంబర్‌లను గూగుల్ సహాయముతో సేకరించాడు. ఆ నెంబర్ల ద్వారా సదరు ప్రభుత్వ అధికారులకు ఫోన్‌లు చేసి తాను సిఎంవో ఆఫీసు (ముఖ్యమంత్రి గారి కార్యాలయం)లో పనిచేస్తున్నానని నమ్మబలకడం, ప్రభుత్వ కార్యక్రమాలలో మీడియా వారి భోజనాలు ఖర్చుల నిమిత్తము, ఇతర ఖర్చులకు గాను డబ్బులు పంపమని అధికారుల ను బెదిరించి డబ్బులు డిమాండ్ చేసే వాడు. తన స్నేహితుడు, రెండవ నిందితుడైన దావులూరి ప్రసాద్ ఫోన్‌పే, గూగూల్ పే నెంబర్‌లు అధికారుల వ్యాట్సాఫ్‌లకు పంపుతూ వారి నుండి డబ్బులు వసూలు చేశాడు. ఈ క్రమ ంలో అనంతపురం జిల్లా డిటిసి ఎన్. శివరామప్రసాద్‌కు ఇదే తరహాసే ఫోన్ చేశాడు. తాను సిఎంవో అధికారి అని నమ్మబలికి డబ్బులు పంపమని డిమాండ్ చేశాడు. ఈ మేరకు డిటిసి ఫిర్యాదు చేయడంతో అనంతపురం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఛీటింగ్ కేసు నమోదు చేశారు.

**అరెస్ట్ :** ఏకంగా సిఎంవో కార్యాలయం పేరున మోసాలకు పాల్పడుతుండటాన్ని జిల్లా ఎస్పీ త్రీవంగా పరిగణించారు. వెంటనే ఛేదించాలని ఆదేశించారు. అనంతపురం డీఎస్పీ పర్యవేక్షణలో వన్‌టౌన్ సిఐ రవి శంకర్‌రెడ్డి, ఎస్ఐ గౌస్ భాష, సిబ్బందితో కలిసి ఒక ప్రత్యేక బృందంగా ఏర్పడి రాబడిన పక్కా సమాచారంతో ఈ ఇద్దరి నిందితులను అరెస్ట్ చేశారు.

**మొదటి నిందితుడిపై రౌడీషీట్ :** మొదటి నిందితుడైన సూర్యప్రకాష్ ఆచారిపై తెలంగాణలోని హయత్ నగర్ పోలీసు స్టేషన్‌లో రౌడీషీట్ కూడా నమోదయినట్లు విచారణలో తెలింది. అంతే కాకుండా ప్రభుత్వ అధికారులను ఫోన్లలో బెదిరించి డబ్బులు గుంజిన మోసాలపై హైదరాబాద్‌తో పాటు పలు ప్రాంతాల్లో పది కేసులు ఉన్నట్లు వెల్లడైంది.

# సైబర్ మోసాలపై జాగ్రత్తగా ఉండండి - జిల్లా ప్రజలకు ఎస్పీ డా.కె.ఫక్కీరప్ప విజ్ఞప్తి



జిల్లా ఎస్పీ డా.కె.ఫక్కీరప్ప

అనంతపురం క్రైం, నవంబర్ 18 ప్రభాతవార్త
మీరు ఉద్యోగం కోసం ఆన్‌లైన్ వెబ్‌సైట్స్‌లో దరఖాస్తు చేసుకున్నారా! మీరు ఎవరైనా డేటా ఎంట్రీ ఆపరేటర్ వర్క్ ఇస్తాం? మీరు దానిని కరెక్ట్ చేసి పంపిస్తే మీరు చేసే పనిని బట్టి మీకు జీతం ఇవ్వబడుతుంది అని ఎవరైనా ఫోన్ చేశారా? అయితే మీరు జాగ్రత్త పడాల్సిన అవసరం ఉంది అని అనంతపురం జిల్లా ఎస్పీ డా.కె.ఫక్కీరప్ప శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సైబర్ నేరగాళ్లు తమ పంథను మార్చి ప్రజల సొమ్మును కాజేసే అవకాశముందన్నారు. నిరుద్యోగులు ఎవరైతే ఉద్యోగ అవకాశం కోసం ఎదురు చూస్తుంటారో వారినే తమ టార్గట్‌గా ఎంచుకొని మొదటగా మిమ్మల్ని ఫోన్ ద్వారా సంప్రదించి మేము ఫలానా వెబ్‌సైట్‌లో మీ బయోడేటా చూసి మీకు ఉద్యోగ అవకాశం ఇస్తున్నామని చెబుతారన్నారు. ఉద్యోగం కోసం ఎదురు చూసే మీరు ఆఫోన్ రాగానే ఆనందంలో మేము ఎలాంటి పని చేయాలి అడగగా...సైబర్ నేరగాళ్లు మీకు డేటా ఎంట్రీ ఆపరేటర్ పనిని ఇస్తున్నామని, ఆ పని మీరు సరిగ్గా చేసి మాకు పంపాలని మీతో చెబుతారన్నారు. మీతో ఉద్యోగ రీత్యా ఒక అగ్రిమెంట్‌పై డిజిటల్ సిగ్నేచర్ తీసుకుంటారన్నారు. మీరు ఉద్యోగంలో చేరి పోయినట్టే అని చెబుతారన్నారు. మీకు డేటా ఎంట్రీ పనిని అప్పగిస్తారని, మీరు ఆ పనిని సరిగ్గా చేసి పంపినా కూడా మీరు తప్పుగా చేశారని కంపెనీ ఇమేజ్ నాశనం అయిందని దాని కోసం నష్ట పరిహారం కట్టమంటారన్నారు. లేకపోతే మీపై పోలీసు స్టేషన్‌లో కేసు పెడతామని బెదిరిస్తారని, ఆ మాటలకు భయపడి పోయి మీరు సైబర్ నేరగాళ్లు అడిగిన డబ్బును వేస్తారన్నారు. కొన్ని రోజుల తర్వాత మీకు కోర్టు నోటీస్ ఇష్యూ చేస్తున్నామని, వాటిని ఆపడం కోసం కొంత మొత్తాన్ని వేయమంటారు. ఆ మాటలకు భయపడి మీరు సైబర్ నేరగాళ్లు అడిగిన డబ్బును వేస్తారు. ఇలా పలు దఫాలలో మీ నుంచి డబ్బును వసూలు చేస్తారు. మరి కొన్ని రోజులకి మీ కోసం పోలీసు స్టేషన్‌లో సమస్య పరిష్కారం కోసం కొంత డబ్బును వేయమంటారు. అప్పటికే మీ నుండి కొంత మొత్తం డబ్బుల్లు వసూలు చేసి ఉంటారు. కాబట్టి వారితో విసుగు పోయిన మీరు మీకు దగ్గరలోని పోలీసు స్టేషన్‌ను సంప్రదించగా వారు సైబర్ నేరగాళ్లు అన్న విషయం తెలుసుకుంటారు.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు :** .తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఎవరైనా సంప్రదిస్తే వారిని నమ్మకండి. మీకు ఎవరైనా ఉద్యోగం ఇస్తున్నాం అని ఎవరైనా చెబితే మొదట మీరు ఆ కంపెనీలో ఉద్యోగం కోసం దరఖాస్తు చేశారో లేదో చెక్ చేసుకోండి. ఎవరైనా ఈ విధంగా మోసపోతే సైబర్ క్రైంకు లేదా 1930కు ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# పోలీసు సిబ్బంది గ్రీవెన్స్‌కు 14 పిటీషన్లు



పిటీషన్లు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ డా.కె.ఫక్కీరప్ప

అనంతపురం క్రైం, నవంబర్ 18 ప్రభాతవార్త
జిల్లా పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి జిల్లా ఎస్పీ డా.కె.ఫక్కీరప్ప శుక్రవారం తన కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. కూతురు పెళ్లి కోసం వెల్ఫేర్ ఫండ్ నుండి లోన్ ఇవ్వాలని, అనారోగ్య సమస్యలు, సస్పెన్షన్ రివోక్ చేయాలని, తదితర సమస్యలపై సిబ్బంది మొత్తం 14 పిటీషన్లు అందజేశారు. ఈ పిటీషన్లను వెంటనే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు కార్యాలయం పరిపాలనాధికారి శంకర్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు త్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి, తేజ్‌పాల్, తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయా సమీపంలో ఉన్న కరెంట్ పోల్ తొలగింపు



కరెంట్ పోల్‌ను తొలగిస్తు న్న దృశ్యం

అనంతపురం రూరల్,నవంబర్18ప్రభాతవార్త:
అనంత రూరల్ మండలం ఉప్పరపల్లి గ్రామంలోని నూతన గ్రామ సచివాలయంను ముందు కరెంట్ పోల్ అడ్డంగా ఉండంతో వాటీని గ్రామ సర్పంచ్ సావిత్రీ శ్రీనివాసులు,అధికారులు తొలగించి సచివాలయ పక్కన నూతన కరెంట్ పోల్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు,సచివాలయానికి ఏటువంటీ ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకువడం జరిగిందని సర్పంచ్ తెలిపారు.

## కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు



ముగ్గులను పరిశీలిస్తున్న చైర్మెన్ ఎల్.ఎం. ఉమా మోహన్‌రెడ్డి

అనంతపురం న్యూటౌన్, నవంబర్ 18 ప్రభాతవార్త
55వ జాతీయ గ్రంథాలయ వారోత్స వాల్లో భాగంగా సంస్థ ఉమ్మడి జిల్లా చైర్మెన్ ఎల్.ఎం .ఉమా మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వివిధ పాఠశాలల విద్యార్థులకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. అలాగే వైయస్ఆర్ జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అలాగే సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయ నిర్ణేతలు ఆర్టీసీ చైర్ పర్సన్ మంజుల ఓబులేసు, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య వ్యవహ రించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రమ, మాజీ చైర్మెన్ ఎల్.ఎం. మోహన్‌రెడ్డి, కార్పొరేటర్లు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కుటాగుళ్ల ఆటోస్టాండ్‌లో ఆటోడ్రైవర్ దారుణ హత్య



హత్యకు గురైన ఆటోడ్రైవర్ వంశీ

కదిరి టౌన్, నవంబర్ 18, ప్రభాతవార్త : కదిరి మున్సిపల్ పరిధిలోని కుటాగుళ్ళ ఆటో స్టాండ్‌లో శుక్రవారం ఇరువురి ఆటోడ్రైవర్ల మధ్య తలెత్తిన వివాదంతో ఆటోడ్రైవర్ వంశీ దారుణ హత్యకు గురైనట్లు పట్టణ సిఐ తమ్మిశెట్టి మధు తెలిపారు. సిఐ మధు తెలిపిన వివరాల మేరకు శుక్రవారం హత్యకుగురైన వంశీ, బెస్త అజయ్‌ల మధ్య అప్పు విషయంలో వాదోపవాదాలు జరిగాయని వీరితో పాటుగా మరో నలుగురు స్నేహితులు కూడా వివాదాన్ని సద్దుమనిగించే ప్రయత్నంలో ఒక్కసారిగా అజయ్ వంశీ చాతిపై కత్తితో పొడవగా అక్కడికక్కడే కుప్పకూలి పోయాడన్నారు. స్నేహితులు హుటాహుటిన కదిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలిచంగా చికిత్స పొందుతూ వంశీ మృతి చెందాదన్నారు. నిందితుడు పరారీలో ఉన్నాడని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో ఒక విద్యార్థి మృతి మరొకరికి తీవ్రగాయాలు

ఓబుళదేవరచెరువు, నవంబర్ 18, ప్రభాతవార్త : మండల పరిధిలోని గాజుకుంటపలి సమీ పంలోని శుక్రవారం కదిరి–హి ందూపురం ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక విద్యార్థి మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డాడు. ఇందుకు సంబందించి ఎస్సై తెలిపిన వివరాల మేరకు ఓడిసి మండలం చింత మాను పల్లి పంచాయితీ పరిధిలోని మల్లేమల్లపల్లి గ్రామానికి చెందిన ఆశోక్ కు మార్‌తో పాటు అమడగూరు మండలం మహమ్మదాబాద్ గ్రామానికి చెందిన ఈశ్వర్‌లు ద్విచక్ర వాహనంలో కదిరికి వెలుతున్నారు. అయితే గాజుకుం టపల్లి గ్రామం దాటుకని వరదరాజులగుట్ట వద్ద కదిరి నుంచి వస్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో ద్విచక్ర వాహనంలో వస్తున్న ఆశోక్(19) తలకు తీవ్ర గాయాలు కాగా మరోకరికి రక్తగాయాలయ్యాయి. తీవ్రంగా గాయ పడ్డ ఆశోక్‌ను హుటాహుటిన 108 అంబులెన్స్ వాహనంలో చికిత్స నిమి త్తం కదిరికి తరలించారు. చికిత్స పొందుతూ విద్యార్థి మృతి చెందాడు. ప్ర స్తుతం ఈశ్వర్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. విద్యార్థి మృతదే హాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు. కాగా మృతి చెందిన విద్యార్థి ఓడీచెరువు మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతున్నట్లు ఎస్సై తెలిపారు.

# మత్తు పదార్థాల రవాణాను అడ్డుకట్టవేయండి
## - కదిరి జనసేన ఇన్‌చార్జ్ భైరవ



మాట్లాడుతున్న జనసేన కదిరి ఇన్‌చార్జ్ భైరవ

కదిరి, నవంబర్ 18, ప్రభాతవార్త : మత్తు పదార్థాలైన గంజాయి, హెరాయిన్ వంటి మాదకద్రవ్యాలను మహరాష్ట్ర కర్నాటక, తమిళనాడు వం టి రాష్ట్రాలలో పట్టుబడుతున్నాయని జనసేన పార్టీ కదిరి ఇన్‌చార్జ్ భైరవ ప్రసాద్, అధ్యక్షులు కాయల చలపతిలు పేర్కొన్నారు. స్థానిక జనసేన కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంజాయి రవాణాకు ప్రధాన కేంద్ర బిందువు ఆంధ్రప్రదేశ్ అవుతోందని యువత గంజాయికి బానిసలై జీవితాలను చిద్రం చేసుకుంటున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మత్తు పదార్థాలకు రవాణాకు అడుకట్ట వేయడంలో ఉదాసీనంగా వ్యవహరిస్తోందన్నారు. గంజాయి, హెరా యిన్ వంటి మత్తుపదార్థాలకు బానిసలైన వారు మహిళలపై విచక్షణా రహితంగా దాడులు జరుపుతున్నారన్నారు. వీరిపై రాష్ట్ర హోంమంత్రి డిజి పిలు కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. సున్న పుగుట్టతాండా, నిజాం వలికాలనీ, అడపాలవీదులలో గంజాయికి బానిసలైన కొంత మంది యు వకులు, బాలికలపై ర్యాగింగ్‌కు పాల్పడుతున్నారన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు గంగరాజు, శ్రీనివాసులు, గంగులప్ప, అంకాలప్ప, పొరకల రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్టీ సాధనకు వడ్డెర్లు కలసికట్టుగా పోరాడాలి
## - పిలుపునిచ్చిన వడ్డెర సంఘం నాయకులు



దీక్షను విరమింప చేస్తున్న వడ్డెర రాష్ట్ర నాయకులు వెంకట్

కదిరి టౌన్, నవంబర్ 18, ప్రభాతవార్త : ఎస్టీ రిజర్వేషన్ సాధనకు వడ్డెర్లు కలసికట్టుగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని శ్రీ ఖాద్రీ వడ్డెర్ల సంక్షేమ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఇందులో గత 3 రోజులుగా ఎస్టీ రిజర్వేషన్‌కోసం చేస్తున్న రిలే నిరాహార దీక్షను శుక్రవారం విరమించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర సమర యోధుడు వడ్డె ఓబన్న చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ దీక్షా శిబిరంలో టిడిపి రాష్ట్ర వడ్డెర సాధికార సమితి కన్వీనర్ వడ్డే భైముతక వెంకట్, పులివెందుల మున్సిపల్ చైర్మెన్ వల్లెపు వరప్రసాద్, దేవళ్ళ మురళి, జేఏసి నాయకులు సంపంగి గోవర్ధన్‌లు మాట్లాడుతూ వడ్డెర్లు అన్ని రంగాల్లో తీవ్ర వెనుకబాటుతనంలో ఉన్నారని వారికోసమైనా ప్రభుత్వం దిగివచ్చి తమకు ఎస్టీ రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం టిడిపి వడ్డెర సాధికర సమితి కన్వీనర్ వెంకట్ నిమ్మరసాన్ని వడ్డెర సంఘం నాయకులకు ఇచ్చి దీక్షను విరమింపచేశారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకలు రమణ, అల్లుగుండు నారాయణస్వామి, వల్లెపు నాగార్జున, దళవాయి వెంకటనారాయణ,జెరిపిటి క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

